క్లుప్తంగా

నేటి నుంచి ఉత్సవాలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో ఆదివారం నుంచి ఈశ్వరాంజనేయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు గాను ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా జల్డి బిందె ఊరేగింపు,స్వామి వారికి జల,పంచామృతాభిషేకం,అఖండ భజన,రథోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు సూచించారు.

21 నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు



మరికల్: మండలంలోని పస్పుల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు శనివారం విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 23 వరకు శివాలయంలో గణపతి, శివలింగ, నాగదేవత, సుబ్రహ్మణ్యస్వామి, ధ్వజస్తంభం, నాభిశిలా, మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలకు అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

ఎల్ఓసీ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే




మాగనూర్ (మక్తల్): ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆయన నివాసంలో రుద్రసముద్రం గ్రామానికి చెందిన మలిగేరి లింగమ్మకు రూ.47 వేలు, జగదీశ్వరికి రూ.18 వేలు, చిన్న కడుమూరు గ్రామానికి చెందిన కల్వ రవికు మంజూరైన రూ.38 వేల ఎల్ఓసీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ఓసీలను మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు



కోస్గి రూరల్: కోస్గి బస్టాండ్‌లో జరుగుతున్న వరుస దొంగతనాల నిర్మూలనకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించారు. శనివారం కోస్గి బస్టాండ్‌లో కానిస్టేబుల్ అంబయ్యగౌడ్ పలువురి ఫింగర్ ప్రింట్‌లను తీసుకున్నారు. దొంగతనాలకు చెక్ పెట్టేందుకే ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు చేపట్టామన్నారు. ప్రయాణికుల మాటునా కొంత మంది వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రజలు బస్సు ఎక్కే, దిగే స మయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించాలి



దామరగిద్ద: కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న మండల కాంగ్రెస్ కమిటీ ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మంగుశ్రీను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల పక్షాన నిలబడి ఎన్ని అడ్డంకులు ఎదురైన పార్టీని వీడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేసిన యువతకు కాంగ్రెస్ పార్టీ గుర్తించి అవకాశాలు కల్పిస్తే మరో పదేళ్ల పాటు పార్టీ పటిష్ఠతకు యువ నాయకత్వం పనిచేసే అవకాశం ఉంటుందన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే

- 11 నుంచి ప్రారంభం కానున్న వేడుకలు
- కర్ణాటక, మహారాష్ట్రల నుంచి లక్షలాదిగా భక్తుల రాక



ప్రధానాలయం గర్భగుడి



స్వామివారి మూలవిరాట్

మాగనూర్: మండలంలోని మాగనూర్ గ్రామంలో కొలువైన ఆపద మొక్కులవాడు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వేళయింది. వైకుంఠ వాసుడి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచే ప్రారంభం కానున్నాయి. అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఆలయ చరిత్ర

శ్రీకృష్ణదేవరాయులు పరిపాలన కాలంలో వెంకట రాయులు అనే సామంత రాజు ఈ ప్రాంతానికి దండు(గుంపు)గా వచ్చి ఇక్కడ జరిగిన యుద్ధంలో ఓటమి చవి చూశారు. ఈ సమయంలో ఆయన అక్కడ నిద్రిస్తుండగా స్వామి వారు కళ్లలోకి వచ్చి తాను ఒక ప్రాంతంలో రాయిగా ఉన్నానని తనను ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించాలన్నారు. దీంతో వెంకటరాయులు స్వయంగా స్వామి వారిని ఇక్కడ ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం

మాగనూర్‌లో వెలసిన వైకుంఠ వాసుడు శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ఏమైన కోరికలు కోరుకుంటే వెంటనే నెరవేరుతాయని ఇక్కడి ప్రజల్లో అపార నమ్మకం ఉంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న వారు స్వామిని దర్శించుకున్నా విముక్తి కలుగుతుందని ప్రత్యక్షంగా అనుభవం పొందిన భక్తుల విశ్వాసం.

బ్రహ్మోత్సవాలు ఇలా..

ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ విధంగా సాగనున్నాయి. 10వ తేదీ నరసింహ జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకం,. ధ్వజారోహణం పల్లకిసేవ, 11న స్వామి వారికి అభిషేకం, 12న ప్రభోత్సవం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం, ఉదయం 11 గంటలకు జ్యోతులు, సాయంత్రం 6:15 నిమిషాలకు తెప్పోత్సవం, మంగళహారతి, 13న మంగళవారం ఉదయం 5–15 నిమిషాలకు రథోత్సవం, సాయంత్రం 5:30 నిమిషాలకు పాల ఉట్లు, 14న బుధవారం ఉదయం 8:45 నిమిషాలకు శేష వాహన సేవ, హనుమాన్ వాహనం కార్యక్రమంతో బ్రహోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలి. స్వామి వారి కళ్యాణం, హోమంతో పాటు ప్రత్యేక పూజల్లో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి.

– వాకిటి వాబయ్య, ఆలయ కమిటీ చైర్మన్

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: మాగనూర్ మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్, మంచినీరు, వీధి దీపాలు, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్‌గౌడ్, రవికుమార్, శివరాంరెడ్డి, వాకిటి శ్రీనివాసులు, దండు ఆనంద్, అశోక్, నర్సింహ, బాలు, కృష్ణయ్య పాల్గొన్నారు.

మహేశ్వరి కుటుంబానికి అండగా ఉంటాం



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి గ్రామానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని మహేశ్వరి ఇటీవల గద్వాల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. మహేశ్వరి కుటుంబసభ్యులను శనివారం బీజేపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మహేశ్వరి మృతి చెందడం బాధకరమన్నారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, సోమశేఖర్‌గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని దయానంద్ విద్యా మందిర్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో 2000–01లో టెన్త్ క్లాస్ చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యానేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఎక్కడెక్కడో స్థిరపడినా గురువులను గుర్తుంచుకొని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమ్మ, రామ్ చరణ్, సి.నారాయణ రెడ్డి, కె.నారాయణ, సూర్యనారాయణ, జి.నారాయణ, ప్రభాకర్, గోపాల్ గౌడ్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి



మాగనూర్(మక్తల్): పెన్షనర్లకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మక్తల్ పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వందమంది పెన్షనర్స్ పాల్గొని సమస్యలపై చర్చించారు. పెన్షనర్స్ దాచుకున్న డబ్బులు రాక చాలా మంది ఆత్మహత్యలు చేసుంటున్నారని, రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు రావాల్సిన నిధులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ ఖాదర్ బాషా, దేవేంద్రప్ప, సిద్ధి లింగయ్య, సూర్య ప్రకాష్, కిష్టయ్యగౌడ్, జనార్ధన్ పాల్గొన్నారు.

మీసేవ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: జిల్లాలోని మీసేవ నిర్వాహకులు ఆదివారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బైరాశంకర్, ప్రధాన కార్యదర్శి మమ్మద్ మోహిద్ హాజరై తెలంగాణ మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కోయిలకొండ వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా కంరోద్దీన్, శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఇమ్రాన్ ఖాన్, సంయుక్త కార్యదర్శులుగా కరుణానిధి, బి.రవి తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని శనిశ్వర స్వామి దేవాలయంలో శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామి వారికి నల్లవస్త్రాలు సమర్పించి తైలాభిషేకం పుష్పాలంకరణ పూజలతో పాటు మహామంగళ హారతి, సర్వదర్శనం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు

మద్దూరు/ కొత్తపల్లి: అమర జవాన్ మురళీనాయక్‌కు మద్దూరులోని వాలీబాల్ అసోసియేషన్, కొత్తపల్లి వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. శనివారం రాత్రి మద్దూరులోని పాత బస్టాండ్ చౌరాస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం మురళి నాయక్ ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మధుసూధన్‌రెడ్డి, మాజీ ఆర్మీ జవాన్ శ్రీనివాస్, కేశవరెడ్డి, రాజిరెడ్డి, వెంకటప్పగౌడ్, రాంరెడ్డి, అథీక్, మణికంఠ, ఫయాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

నరసింహ జయంతి ఉత్సవాలు ప్రారంభం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నరసింహ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల్యం ,సుప్రభాతం పంచామృతాభిషేకం సర్వసేవ, భజన పల్లకి సేవా తదితర కార్యక్రమాలను జరిపించారు. మరో మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహ చారి, అనిల్ దేశాయి, శ్రీపాద, సీతారామారావు, అనిరుద్, ప్రసాద్, నారాయణరావు, నరసింహ, శేషు, మంజునాథ జోషి పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఆదిత్య పరాశ్రీ



క్రీడాకారులను సన్మానిస్తున్న ఆదిత్య పరాశ్రీ

ఊట్కూరు: బిజ్వార్ గ్రామంలోని అంభత్రయ క్షేత్రంలో నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం ఆదిత్య పరాశ్రీ స్వామి అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడలలో ప్రతిభ కనబర్చిన రాయికోడ్ గ్రామానికి చెందిన అనూష, గుర్లపల్లి గ్రామానికి చెందిన స్వప్న తదితరులను శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింగప్ప, సత్యనారాయణ, కృష్ణ, పీఈటి గోపాలం, గోపిగౌడ్, రాజు పాల్గొన్నారు.

సిందూర్ ముగ్గుతో అలరించిన చిన్నారులు



నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామంలో చిన్నారులు నిహారిక, సంకీర్తన, నిఖిల్ తమ ఇంటి ముందు భారతదేశ చిత్రపటం గీసి మువ్వన్నెల రంగులను చక్కగా అలంకరించి సిందూర్ ముగ్గు వేశారు. పాక్‌తో యుద్ధం నేపథ్యంలో భారత సైనికుల సాహసాలని కొనియాడుతూ ముగ్గును వేశారు. అనంతరం జై జవాన్.. జై భారత్ అంటూ నినాదాలు చేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా హన్మంతు



ఊట్కూరు: లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఊట్కూరు గ్రామానికి చెందిన హన్మంతును శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఊట్కూరులో జరిగిన లయన్స్ క్లబ్ సమావేశంలో కార్యదర్శిగా శ్రీదర్‌గౌడ్, కోశాధికారిగా కృష్ణార్జున్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి, చైర్మన్‌గా సూర్యప్రకాష్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన సభ్యులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, అనిల్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



ఊట్కూరు: ఊట్కూరు మండలంలోని పెద్దపొర్ల గ్రామానికి చెందిన యువకుడు అనిల్ ఇటీవల భారతసైనిక విభాగం అగ్నివీర్‌కు ఎంపిక అయ్యాడు. ఈ క్రమంలో తాపస్ సంఘం నాయకులు, గ్రామస్తులు అనిల్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. యువకుడితో పాటు తల్లిదండ్రులకు శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా తాపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ దేశరక్షణ కోసం మారుమూల గ్రామానికి చెందిన యువకుడు ఎంపిక కావడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింగప్ప, సత్యనారాయణ, కృష్ణ, గోపాల్, లక్ష్మన్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం



ఆంజనేయులును సన్మానిస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో మక్తల్ మండలం మంతన్‌గోడ్ గ్రామానికి చెందిన ఆర్మీ జావాన్ ఆంజనేయులును మాగనూర్ గ్రామ పెద్దలు ఆదివారం శాలువాతో సన్మానించారు. ఆంజనేయులు మాగనూర్ గ్రామంలోనే 3వ తరగతి నుంచి 10 వరకు చదువుకుని 2011లో ఆర్మీలో చేరి దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక వైపు జవాన్‌గా దేశానికి సేవ చేస్తూనే.. మరోవైపు పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకోవడంతో ఆయనను ఘనంగా సన్మానించినట్లు గ్రామపెద్దలు తెలిపారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని దేశానికి సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాగనూర్ మండల ఎంఈవో మురళీధర్‌రెడ్డి, గ్రామ పెద్దలు మధుసుదన్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, అశోక్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు



కిరాణం దుకాణంలో స్నైపర్ డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నర్వ: గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. శనివారం నర్వ మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలు, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగించినా లేదా రవాణా చేసిన వెంటనే డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పోలీస సిబ్బంది సురేష్‌బాబు, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నేతలు

నర్వ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు మా పోరాటం ఆగదని వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజ్ అన్నారు. శనివారం కొత్తపల్లి గ్రామంలో వాల్మీకి బోయ సంఘం గ్రామ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కమిటీ ఎన్నిక జిల్లా, మండల కమిటీల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగినట్లు నాయకులు పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా గోవిందు, ప్రధాన కార్యదర్శిగా బి.రాములు, కోశాధికారిగా రామచంద్రి, ప్రచార కార్యదర్శిగా రుక్కన్న, కార్యదర్శిగా కేశవులు, కార్యవర్గ సభ్యులుగా రాజు, సాబన్న, మోహన్‌బాబు, రామంజనేయులు, చిన్న ఆశన్న, సూరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నీరజ్, గడ్డం నర్సింహ్, ఉమాపతి, లక్ష్మన్న, మండల అధ్యక్షులు అయ్యన్న, ప్రధాన కార్యదర్శి ముమ్మలి రాములు, నాయకులు అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

పద్మశాలీలకు రుణాలు మంజూరు చేయాలి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

ధన్వాడ: పద్మశాలీ కులస్తులను జియోట్యాగ్‌తో సంబంధం లేకుండా సబ్సిడీ లోన్‌లు మంజూ రు చేయాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధన కార్యదర్శి ఉదయభాను కోరారు. శనివారం ధన్వాడ మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయస్వామి దేవాయలంలో అధ్యక్షులు బాలరాజు అధ్యక్షతన కుల శ్రేష్ఠి ఎంపికలు నిర్వహించారు. కులశ్రేష్ఠిగా మ్యాకరి సుర్యప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం మా ట్లాడుతూ పద్మశాలీలు చేనేత వృత్తిలో సంపద న లేక వేరే ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. ప్రభుత్వం ఆలోచించి పద్మశాలీలకు ఎలాంటి నిబంధనలు లేకుండా సబ్సిడీ రుణాలు మంజురు చేసి ఆదుకోవాలని కోరారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో ఫొటోగ్రాఫర్లు

ఆత్మకూర్: ఫొటోగ్రాఫర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం, ఉపాధ్యక్షుడు నవీనశ్రీను, ప్రధాన కార్యదర్శి తౌఫీఖ్ అన్నారు. శనివారం ఫొటో స్టూడియోల బంద్ నిర్వహించి స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో సమావేశమయ్యారు. ఒకప్పుడు వినియోగదారులతో వెలిగిపోయిన ఫొటో స్టూడియోలు సెల్‌ఫోన్ల కారణంగా గిరాకులు లేక వెలవెల బోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేయడంతో పాటు ఆధునిక కెమెరాలు, రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, జగన్, తిరుపతి, అనిల్, ప్రసాద్, రంజిత్, లక్ష్మణ్, రాజశేఖర్, వెంకట్రాములు, ప్రేమ్‌కుమార్, నరేష్, రవి, నర్సింహ, ఖాజీ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.